**లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి స్ఫూర్తిదాయకం

ఢిల్లీ: డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.మరోవైపు అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్రాల ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే అంబేడ్కర్ వాదులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయణ్ని గుర్తు చేసుకుంటున్నారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:88 ఎడిటర్: సయ్యద్ పాష 15-04-2026 బుధవారము పేజీలు :8 వెల:1/-


## ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహ నాల ఫీజుకు సంబంధించి కొత్త రూల్స్



న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల నిబంధనల అమలును పటిష్టం చేయడం, హేతుబద్ధమైన ఫీజులు వసూలును నిర్ధారించటమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల ఫీజు (రేట్ల నిర్ధారణ, వసూలు) నాలుగో సవరణ నిబంధనలు 2026ను నోటిఫై చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2026 ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. నిర్దేశించిన లోడు పరిమితులను పాటించడాన్ని ప్రోత్సహించడం, రహదారి మౌలిక సదుపాయాలను పరిరక్షిస్తూ రోడ్డు భద్రతను పెంచడం ఈ సవరణ లక్ష్యమని కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తెలిపింది. సవరించిన రుసుము విధానం ప్రకారం, ఓవర్ లోడ్‌తో వెళున్న వాహనాలకు లోడు శాతాన్ని బట్టి రుసుము విధిస్తామని స్పష్టం చేసింది. 10 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ఎలాంటి ఓవర్ లోడ్ రుసుము విధించమని పేర్కొంది. అయితే 10-40 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు రెట్టింపు ఫీజును విధిస్తామని వెల్లడించింది. 40 శాతానికి పైగా ఓవర్ లోడుతో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు నాలుగు రెట్లు అధికంగా ఫీజు వసూలు చేస్తామని చెప్పింది.టోల్ ప్లాజాల వద్ద ఏర్పాటు చేసిన సర్టిఫైడ్ తూకం యంత్రాలను ఉపయోగించి ఓవర్ లోడింగ్‌ను నిర్ధారిస్తామని కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఫీజు వసూలు చేసే ప్లాజాల వద్ద తూకం వేసే సౌకర్యాలు అందుబాటులో లేని సందర్భాల్లో, ఎటువంటి ఓవర్‌లోడ్ ఫీజు విధించమని వెల్లడించింది. ఓవర్ లోడింగ్ ఫీజులను కేవలం ఫాస్టాగ్ ద్వారా మాత్రమే వసూలు చేస్తామని పేర్కొంది. ఓవర్ లోడ్ అయిన వాహనాల వివరాలు రికార్డు అయ్యి, జాతీయ వాహన రిజిస్టర్ (వాహన్)కు చేరుతాయని వెల్లడించింది.

## దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లు



హైదరాబాద్,: లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేడ్కర్ పాత్ర అంతే ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే చూడలేకపోతున్నారంటూ విమర్శించారు.గతంలో భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత హోదాను తొలగించేలా కుట్రలు జరిగాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎనాడైనా డైట్ ఛార్జీలు పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఓర్వలేకపోతున్నారంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక 67వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 67వేల ఉద్యోగాల్లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే వచ్చాయని వెల్లడించారు.పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం వ్యాఖ్యా నించారు. ఆనాడు చేసిన అప్పులు చెల్లిస్తూ.. తప్పులు సరిదిద్దుతూ పాలన కొనసాగిస్తు న్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 50 శాతం జనాభా ఆధా రంగా.. మరో 50 శాతం జీఎస్‌డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్‌లో డీలిమిటేషన్ చేపట్టా లని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాం లోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించిందని.. కానీ లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## బాబాసాహెబ్ ఆశయ సాధనే లక్ష్యం కావాలి



కల్లూరు,: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కల్లూరు మండల కేంద్రంలోని మెయిన్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే నేడు అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ , జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నల్లగొండలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు




నల్లగొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ బైపాస్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సమానత్వం కోసం అంబేద్కర్ గారు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడు మనందరికీ హక్కులు, స్వేచ్ఛ లభించాయని తెలిపారు. అంబేద్కర్ గారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రమాదరహిత సమాజాన్ని నిర్మిద్దాం



నిర్మల్,: ప్రమాద రహిత సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డిఅన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణంలో పోలీసు అక్కలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. అనంతరం ఎల్లెపెల్లి శివారులో భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. పోలీసు అక్కలకు స్కోచ్ అవార్డులు అందించారు. సోన్ మండలంలోని గంజాల్ నేషనల్ హైవే టోల్ ప్లాజావద్ద లారీ డ్రైవర్లకు హెల్త్ కిట్లు పంపిణీ చేసి సుఖప్రయాణం జరగాలని ఆకాంక్షించారు.సోన్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుసాడి నృత్యంతో ముఖ్య అతిథులకు ఆదివాసీలు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్రంలో ప్రమాదాల నివారణ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఈనెల 18 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సాయికిరణ్, రాజేష్ మీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయి



ఖమ్మం : దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం ఈరోజు (మంగళవారం) జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అలాగే, అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు.నేడు దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోంటే రైతులకు ఆ మేలు జరగకూడదని ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహించారు.పేదలకు ఇళ్లు దక్కకూడదనే లక్ష్యంతో ప్రతిపక్షాల నేతలు దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ బలోపేతానికి అందరం ఐక్యంగా కృషిచేద్దామని భట్టి విక్రమార్క సూచించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడారని ప్రశంసించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేద్దామని సూచించారు. పార్టీకోసం కష్టపడిన వాళ్లకి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## రైల్వే ఎన్టీపీసీ సీబీటీ 1 పరీక్ష తేదీలు విడుదల

న్యూఢిల్లీ:దేశవ్యాప్తంగా 3,058 నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీ (ఎన్?టీపీసీ అండర్? గ్రాడ్యుయేట్) రైల్వే ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సీబీటీ 1 పరీక్ష తేదీలను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) మంగళవారం (ఏప్రిల్ 14) విడుదల చేసింది. ఈ పరీక్షలు మే 7, 8, 9 తేదీల్లో, అలాగే జూన్ 13, 14, జూన్ 16 నుంచి 21వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రం వివరాలు పరీక్ష తేదీకి 10 రోజుల ముందు, అడ్మిట్? కార్డులు 4 రోజుల ముందు అందుబాటులో ఉండనున్నాయి.

## నల్లగొండలో మే 3న ప్రోమో రన్

నల్లగొండ : సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో మే 3వ తేదీన నల్లగొండలో నిర్వహించనున్న "నల్లగొండ ప్రోమో రన్" లో ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సొసైటీ జనరల్ సెక్రటరీ మగ్గరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం రన్ పోస్టర్ విడుదల చేశారు. రన్నింగ్, ఫిట్‌నెస్ ప్రాధాన్యతను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం, అలాగే జూన్ 7న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ వద్ద జరగనున్న అవంతికా తెలంగాణ రన్ 2026 కార్యక్రమాన్ని తెలంగాణ అంతటా విస్తరించేందుకు తెలంగాణ రన్ టూర్ లో రాష్ట్రంలోని పలు నగరాల్లో ఇలాంటి ప్రోమో రన్స్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి నల్లగొండ వాకర్స్ అసోసియేషన్ కమ్యూనిటీ పార్ట్నర్‌గా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని, మరింత మంది రన్నర్స్, ఫిట్‌నెస్ ప్రేమికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ తరఫున రాఘవ్ సంకోజు పాల్గొన్నారు. అలాగే నల్లగొండ వాకర్స్ అసోసియేషన్ తరఫున బండారు ప్రసాద్, డా. పుల్లారావ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ (మాజీ ) శౌరయ్య , బీమార్జున్ రెడ్డి, కట్టా వెంకటరెడ్డి, గుర్రం వెంకన్న, చింతపల్లి వెంకన్న, శంభు, పవన్, భావన, శ్రీనివాస్‌రావు, కీసరి శ్రీనివాస రెడ్డి, భజరంగ్ పాల్గొన్నారు. రన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 25న ముగుస్తుంది కాబట్టి ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకుని విజయవంతం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.

## 67 మంది యువతులను మోసం చేసిన కేటుగాడు..



హైదరాబాద్: ఒకప్పుడు దొంగలు, మోసగాళ్లు అంటే ఎవరికీ కనిపించకుండా.. గుట్టుగా దోచుకుని వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడంతా వైట్ కాలర్ నేరాలు ఎక్కువై పోయాయి. అందరిలో కలిసిపోయి.. ఎవరికీ తెలియకుండా మోసం చేసి.. పారిపో తున్నారు. కొందరు డబ్బు కోసం చేస్తే.. మరికొందరు ఇంకొన్ని అవసరాల కోసం ఇలా మోసాలు చేస్తున్నారు. అయితే చేసిన మోసం ఎప్పటికైనా దొరికిపోవడం ఖాయం కాబట్టి.. ఎప్పుడో ఒకప్పుడు పోలీసులకు దొరికిపోయి.. కటకటాల పాలవుతున్నారు. తాజాగా శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో.. సీఐఎస్ఎఫ్ ఆఫీసర్ వేషంలో తిరుగుతున్న కేటుగాడిని శంషాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి.. తాను ఒక సీఐఎస్ఎఫ్ అధికారిని అంటూ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దర్జాగా తిరుగుతున్నాడు. అయితే అతడి ప్రవర్తన పట్ల శంషాబాద్ పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే అతడి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు బాలకృష్ణ తడబడ టం, పొంతన లేని సమాధానాలు చెప్పడంతో.. అతడు ఫేక్ అధికారి అని వారు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే అతడిని అదుపులోకి తీసుకున్న శంషాబాద్ పోలీసులు.. విచారణ జరపగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.తాను సీఐఎస్ఎఫ్‌లో పనిచేస్తున్నానం టూ.. యువతులను నమ్మించి.. వారిని బాలకృష్ణ బురిడీ కొట్టిస్తున్నట్లు శంషాబాద్ పోలీసులు గుర్తించారు. ఇక శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దర్జాగా సీఐఎస్ఎఫ్ దుస్తులు వేసుకుని తిరుగుతుండటం గమనార్హం. ఇక నిందితుడు బాలకృష్ణ చెప్పిన విషయాలు విని.. పోలీసులే అవాక్కయ్యారు. యువతులను పెళ్లి పేరుతో మోసం చేసేందుకే తాను ఇలా సీఐఎస్ఎఫ్ అధికారిని అంటూ తిరుగుతున్నట్లు చెప్పడంతో పోలీసులు షాక్ అయ్యారు. తాను సీఐఎస్ఎఫ్ అధికారిని అంటూ ఇప్పటివరకు 67 మంది మహిళలను మోసం చేసినట్లు చెప్పడంతో పోలీసులు నోరెళ్లబెట్టా రు.పోలీస్ అధికారుల వేషం వేసుకుని.. మ్యాట్రిమోనీ డాట్‌కామ్‌లో పలువురు యువతులకు తాను వల వేసినట్లు బాలకృష్ణ పోలీసుల విచారణ లో వెల్లడించాడు. ఆ తర్వాత వారిని మాటల్లో పెట్టి.. రకరకాల మోసాలకు పాల్పడినట్లు అంగీకరిం చాడు. దీంతో బాలకృష్ణపై కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు.. ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తును చేపట్టారు.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే...

సమాజంలో మార్పు రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ఆ మార్పు కోసం ముందుకు వచ్చి పోరాడే ధైర్యవంతులు మాత్రం అరుదుగా ఉంటారు. అన్యాయం చూసి మౌనంగా ఉండటం సులభం. దానికి ఎదురు నిలబడటం నిజమైన ధైర్యం. అలాంటి ధైర్యంతో అణగారిన వర్గాల కోసం, మహిళల హక్కుల కోసం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే. ఆయన జీవితం కేవలం చరిత్రలోని ఒక అధ్యాయం మాత్రమే కాదు. అది కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిన జీవగాథ. ఆయన జయంతి ఒక తేదీ మాత్రమే కాదు. మన మనస్సాక్షిని మేల్కొలిపే, మన బాధ్యతలను గుర్తుచేసే చైతన్య దినం. పూలే జన్మించిన కాలంలో భారతీయ సమాజం కులవివక్షతో కట్టుబడి, అసమానతలు, అన్యాయాలతో నిండిపోయి ఉండేది. పుట్టుక ఆధారంగా మనిషి విలువను నిర్ణయించడం, విద్యను కొద్దిమంది వర్గాలకే పరిమితం చేయడం, మహిళలను, అణగారిన వర్గాలను అజ్ఞానంలో ఉంచడం వంటి సమస్యలు విస్తృతంగా ఉన్నాయి.కానీ ఈ అన్యాయాలను పూలే ధైర్యంగా ప్రశ్నించారు. మనిషి విలువ పుట్టుకతో కాదు, గుణాలతో నిర్ణయించబడుతుంది, విద్య అందరికీ హక్కు అనే భావాలతో ఆయన సమాజాన్ని సవాలు చేశారు. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని పుణెలో ఒక సాధారణ మాలీ కుటుంబంలో పూలే జన్మించారు. చిన్నప్పుడే తల్లి మరణం ఆయన జీవితాన్ని కష్టాల దారిలో నడిపించింది. తండ్రి గోవిందరావు కష్టపడి కుటుంబాన్ని పోషిస్తూ, పిల్లలకు జీవన విలువలను నేర్పించారు. పేదరికం, కష్టాలు, సామాజిక అవమానాలు ఆయన బాల్యం లో భాగమయ్యాయి. అయినప్పటికీ అవి ఆయనను బలహీనుడిగా మార్చలేదు. మరింత దృఢసంకల్పంతో ముందుకు నడిపించాయి. చదువుపట్ల ఆసక్తి ఉన్నప్పటికీ కులవివక్ష కారణంగా ఆయన విద్య మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. కానీ తరువాత ఒక స్కాటిష్ మిషనరీ పాఠశాలలో చదివే అవకాశం దొరికిందిఅక్కడ పొందిన పాశ్చాత్య విద్య ఆయనలో విమర్శనాత్మక దృష్టిని పెంచి, సమానత్వం, మానవత్వంపట్ల ఆకర్షణ కలిగించింది. అమెరికన్ తత్వవేత్త థామస్ పెయిన్ రచించిన రైట్స్ ఆఫ్ మాన్ గ్రంథం ఆయన ఆలోచనలపై గాఢమైన ప్రభావం చూపింది. అలాగే ఫ్రెంచ్, అమెరికా విప్లవాలు ఆయనను ప్రభావితం చేశాయి. వీటితోపాటు ఆయనకు ఎదురైనా అనుభవాలు, వ్యక్తులు, సంఘటనలు ఆయనను సమాజ మార్పు కోసం పోరాడే మహానేతగా తీర్చిదిద్దాయి. పూలే జీవితాన్ని మలిచిన ఒక సంఘటన ఎంతో ప్రసిద్ధి చెందింది. ఒక బ్రాహ్మణ స్నేహితుడి పెండ్లి ఊరేగింపులో పాల్గొనప్పుడు, కులం పేరుతో ఆయనను అవమానించారు. నీవు ఈ పెండ్లి ఊరేగింపులో పాల్గొనుటకు అర్హుడు కాదు అనే మాటలు ఆయన హృదయంలో చెరిగిపోని గాయాన్ని మిగిల్చాయి. ఆ అవమానం ఆయనను వెనక్కి తగ్గించలేదు.అది ఆయనలో తిరుగుబాటుకు నాంది పలికింది. మనిషిని కులం ద్వారా ఎందుకు కొలుస్తారు? ఒక కులం గొప్పది, మరొకటి తక్కువది ఎందుకు? అనే ప్రశ్నలు ఆయనలో ఆలోచనల జ్వాలగామారి, సమాజ మార్పుకు మార్గం చూపాయి. మహాత్మా జ్యోతిరావు పూలే విద్య ద్వారానే సమాజాన్ని మార్చడం సాధ్యమని, విద్యనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని బలంగా విశ్వసించారు. అందుకే తొలుత అణగారిన వర్గాలకు, మహిళలకు విద్య అందించడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మార్గంలో ఆయనకు అండగా నిలిచింది ఆయన జీవిత భాగస్వామి సావిత్రిబాయి పూలే. సావిత్రిబాయి పూలే భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిగా నిలిచారు. పూలే ఆమెను విద్యాబోధనకు సిద్ధం చేసి, ఇద్దరూ కలిసి 1848లో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ కాలంలో ఇది విప్లవాత్మక చర్య.అది కేవలం ఒక విద్యాసంస్థ కాదు, అది సమాజ విముక్తి కోసం మొదటి అడుగు. మహిళలు చదువుకుంటే కుటుంబం ఎదుగుతుంది, సమాజం అభివృద్ధి చెందుతుంది అనే గొప్ప సందేశాన్ని ఆయన అందించారు. సమాజం నుండి తీవ్రమైన వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా వారు వెనక్కి తగ్గలేదు. అనేక బాలబాలికల పాఠశాలలు స్థాపించిన అణగారిన వర్గాల పిల్లలు విద్య వ్యాప్తికి కృషి చేశారు. పూలే కేవలం విద్య సేవకే పరిమితం కాలేదు. సమాజం నిర్లక్ష్యం చేసిన వర్గాలకు ఆయన ఒక ఆశాకిరణం అయ్యారు. 1873 లో సత్యశోధక సమాజంను స్థాపించి, సమాజంలో సమానత్వం కోసం పోరాటం చేశారు. ఈ సంస్థ ద్వారా కులవివక్ష నిర్మూలన, మహిళా హక్కులు, వితంతువుల పునర్వివాహం, శిశుహత్యల నివారణ వంటి అనేక సామాజిక సమస్యలపై ఆయన పోరాటం కొనసాగించారు. వితంతు స్త్రీల కోసం, అనాథ శిశువుల కోసం శరణాలయాలు నిర్మించి వారిని ఆదరించారు. వితంతు స్త్రీకి పుట్టిన బిడ్డకు యశ్వంత్ రావు అని పేరుపెట్టి దత్తత తీసుకున్నారు.రైతుల, కార్మికుల సమస్యలపై కూడా ఆయన చేసిన పోరాటం ఆయనను నిజమైన ప్రజానాయకుడిగా నిలబెట్టింది. విద్యతోనే విముక్తి, సమానత్వంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు నేటికీ పూర్తిగా సాకారం కాలేదు. సాంకేతికంగా దేశం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, కులం, లింగం, ఆర్థిక స్థితి ఆధారంగా భేదాలు ఇంకా అనేక ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. విద్య అందరికీ హక్కు అని చెప్పే దేశంలో, ఆ హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా అందుతోందా? సమాన అవకాశాలు నిజంగా అమలవుతున్నాయా? మనం ఆయన చూపిన మార్గంలో నడుస్తున్నామా? అనే ప్రశ్నలకు సమాధానం మనలోనే వెతకాలి. పూలే జయంతి సందర్భంగా కేవలం పూలమాలలు వేసి, ప్రసంగాలు చేయడం మాత్రమే సరిపోదు. ఆయన ఆలోచనలను మన జీవన విధానంలో ఆచరణలోకి తీసుకురావడమే నిజమైన నివాళి. మనం చదివి ఎదగడమే కాకుండా, ఇతరులను కూడా విద్యతో ముందుకు నడిపించడం మన సామాజిక బాధ్యతగా భావించాలి. సమానత్వం, న్యాయం, విద్య అనే విలువలపై నిలిచిన సమాజం నిజమైన అభివృద్ధిని సాధిస్తుంది. అదే పూలే గారికి ఇచ్చే గొప్ప నివాళి.

### వివాహిత వేధింపులకు జిమ్ ట్రైనర్ బలి!

బెంగళూరు: బెంగళూరు శివారు ప్రాంతంలో జరిగిన ఒక విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కేవలం 28 ఏళ్ల వయసున్న జిమ్ ట్రైనర్ దిలీప్, ఒక వివాహిత వేధింపులు తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బెంగళూరు నగర శివారులో జిమ్ ట్రైనర్గా పనిచేస్తున్న దిలీప్ (28) తన నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాథమిక విచారణలో ఒక వివాహిత చేస్తున్న వేధింపుల వల్లే తాను ప్రాణాలు తీసుకుంటున్నట్లు దిలీప్ పేర్కొన్నట్లు పోలీసులు గుర్తించారు. దిలీప్ తండ్రి రమేశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సంచలన విషయాలు వెల్లడించారు. ఇద్దరు పిల్లలున్న ఒక వివాహిత తన కుమారుడిని గత కొంతకాలంగా తీవ్రంగా వేధిస్తోందని ఆయన ఆరోపించారు. ఆమె దిలీప్ను తనతో సహజీవనం చేయాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. పెళ్లై పిల్లలున్నప్పటికీ, దిలీప్ను తన పక్కన ఉండాలని ఒత్తిడి చేస్తూ మానసిక క్షోభకు గురిచేసిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేధింపులను తట్టుకోలేక దిలీప్ చివరికి తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడబోయే ముందు సదరు మహిళకు ఫోన్ చేసి, తాను చనిపోతున్నట్లు చెప్పినట్లు పోలీసులు గుర్తించారు. తన చావుకు ఆ మహిళే కారణమని మరణానికి ముందు తన సన్నిహితుల వద్ద లేదా వాంగ్మూలంలో సూచించినట్లు తెలుస్తోంది. దిలీప్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సదరు వివాహితకు, దిలీప్కు మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఆమె ఏ విధంగా బెదిరింపులకు పాల్పడింది? అనే కోణంలో పోలీసులు ఫోన్ కాల్ డేటా మరియు మెసేజ్లను పరిశీలిస్తున్నారు. ఒక యువకుడు కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి వేధింపుల వల్ల ప్రాణాలు కోల్పోవడం పట్ల జిమ్ వర్గాల్లో మరియు స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### బచ్చన్నపేటను మద్యం రహిత మండలంగా తీర్చిదిద్దుదాం

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాన్ని మద్యం రహిత మండలం గా తీర్చిదిద్దుకుందామనిఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చిన్న రామన్ చర్ల, నక్కవాని గూడెం, రామచంద్ర గూడెం, కొడవటూరు, కొన్నే, పడమటి కేశపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో బెల్ట్ షాపుల జోరు ఎక్కువైందని, ఫలితంగా ప్రజలు తెల్లవారకముందే బెల్ట్ షాపుల్లోకి వెళ్లి మద్యం సేవించి అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు బార్లను తలపిస్తున్నాయని అన్నారు.గ్రామాల్లో బెల్ట్ షాపులు ఇష్ట రాజ్యాంగ నడుస్తున్న ఎక్సైజ్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ మండలంలో నాలుగు గ్రామాల్లో మద్య నిషేధం అమల్లో ఉందని, గ్రామాల్లో స్ఫూర్తిగా తీసుకొని ప్రతి గ్రామంలో మద్దిలేషణ అమలు చేసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో మండలంలో బెల్ట్ షాపులన్నీ బందు చేయాలని, లేని పక్షంలో తానే వచ్చి షాపుల్లో లో సీసాలన్నీ పగలగొడతానని హెచ్చరించారు. పండించిన ప్రతి రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి, సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి, సర్పంచులు ఆజాం ,వెంకటేష్, వినోద్ కుమార్, నీల కవిత, విజయ సోములు, మద్దికుంట రాద, పాకాల నాగలక్ష్మి, శ్రీధర్ గౌడ్,నాయకులు చల్లా శ్రీనివాసరెడ్డి, కోనేటి స్వామి ముసిని రాజు గౌడ్, అనిల్ రెడ్డి, ఈదులకంటి ప్రతాపరెడ్డి, తిరుమల్ రెడ్డి, అశ్విన్ కుమార్, కర్ణాకర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, కనకయ్య గౌడ్, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్, స్వప్న, స్రవంతి, మేకల రాజు, బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు భద్రత నియమాలు పాటించండి

ఆసిఫాబాద్: వాహనదారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్పీ నితికా పంత్ అన్నారు. మండలంలోని బూర్గుడలో అరైవ్-అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, వేగపరిమితిని పాటించాలని సూచిం చారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా వాహనాలు నడపాలని, కుటుం బాల భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత పాటిస్తామని ప్రజలు, పోలీసు అధికారులు ప్రతిజ్ఞ చేశారు. పోలీసులు రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాలాజీ వరప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేసుల ఛేదనలో సీసీటీవీ కెమెరాలు కీలకం



ఆదిలాబాద్:నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించి, కేసులను ఛేదించడానికి ఉపయోగపడేవి సీసీటీవీ కెమెరాలని రాష్ట్ర డీజీపీ శివధర్రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన 490 సీసీటీవీ కెమెరాలను సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 700 సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటూ, ఒక కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానంగా వ్యవహరిస్తుందని వివరించారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, తమ గ్రామాల్లో, పట్టణాల్లో, వీధుల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. నేరస్థులు సీసీటీవీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో నేరాలను చేయడానికి భయపడతారని తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద నేరాల నియంత్రణ పర్యవేక్షణ 24 గంటలు క్రమం తప్పకుండా ఉంటుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్లో నిర్వహించిన ఆపరేషన్ జ్వాలా ముగింపు, ఖాకీ కిడ్స్, వాహనాలు నడిపిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కార్యక్రమానికి డీజీపీ హాజరయ్యారు. పోలీసు ముఖ్యకార్యాలయం ఎదుట ట్రాఫిక్ పార్క్ను ప్రారంభించారు. బస్సులో భరోసా కార్యక్రమంలో భాగంగా బస్సులో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. మై టాక్సీ ఇస్ సేఫ్ 2.0 కార్యక్రమాన్ని డీజీపీ ప్రారంభించి 500 మంది ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ బి.సురేందర్రావు, పరిపాలన అదనపు ఎస్పీ పి.మౌనిక, శిక్షణ ఐపీఎస్ అధికారి రాహుల్కాంత్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్రెడ్డి, పట్టణ సీఐలు, ఎస్ఐలు, రిజర్వు సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచాలి



పెద్దపల్లి,: అంగన్వాడీ టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎనిమిదవ పోషణ పక్షం 2026 కార్యక్రమంలో పాల్గొని పలువురు మహిళలకు ప్రభుత్వం తరుపున సీమంతం చేసి వారిని ఆశీర్వదించి 304 మంది అంగన్వాడీ టీచర్లకు రూ. 42.28 లక్షల విలువ గల స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. అలాగే 13 మంది దివ్యాంగులకు రూ.8.60 లక్షల విలువ గల ల్యాప్టాప్స్, ట్యాబ్స్ పంపిణీ, నియోజవర్గంలోని 513 మంది లబ్ధిదారులకు రూ.1.62 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక ఊరట అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వసతులు, పూర్తి స్థాయిలో డాక్టర్లు, మందులు, కార్పొరేట్ స్థాయిలో సేవలు అందించి రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చుకున్నదన్నారు. ప్రజలు అన్ని వైద్య సేవలకు ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఒకవేళ ఈ ఆసుపత్రిలో సేవలకంటే మెరుగైన వైద్య సేవలు అవసరమైన పక్షంలో హైదరాబాద్లోని నిమ్స్లో వైద్య సేవలు అందించే బాధ్యత తనదన్నారు. దివ్యాంగులకు ల్యాప్టాప్స్, టాబ్స్ పంపిణీ చేసి వారి జీవనోపాధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. అంగన్వాడీ టీచర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకొనే పిల్లల సంఖ్యను పెంచి వారికి మరింత మెరుగైన విద్య అందించాలని కోరారు. ఇప్పటికే అంగన్వాడీ టీచర్లు నిబద్ధతతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తూ మత శిశు సంక్షేమానికి తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు. గ్రామస్థాయిలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందించడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత నుంచి 17 కోట్ల పైచిలుకు సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు అందజేశామని గుర్తు చేశారు. నిమ్స్లో వైద్య ఖర్చులకు సహాయంగా 9 కోట్ల విలువైన ఎల్ఓసీ చెక్కులను అందజేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. సంక్షేమ శాఖ జిల్లా అధికారి వేణుగోపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్లు ముస్కాన్ నాజ్ నయ్యర్, అంతటి పుష్పలత, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుతోనే అభివృద్ధి

తుంగతుర్తి, : ప్రభుత్వ కార్యాలయాలకు నూతన బిల్డింగ్ నిర్మాణముతోనే మండలాలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. నాగారం మండల కేంద్రంలోని నాగారం బంగ్లా ఆవరణలో నూతనంగా తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాల నిర్మాణాలకు సుమారు 11.25 లక్షల వ్యయంతో భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ మాజీమంత్రి జగదీష్ రెడ్డి పాలనలో, ప్రభుత్వ కార్యాలయాలు చేపట్టకపోవడం దురదృష్టకరమైన విషయం అన్నారు.మం డల ప్రజల సౌకర్యార్థమే కార్యాలయాల ని ర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఎస్సారెస్పీ కాలువ నిర్మాణానికి, జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. రెండు సంవత్సరాల పాలనలో సుమారు 2000 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. తిరుమలగిరి ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు తాను ముఖ్యమంత్రితో పలు దపాలుగా చర్చించి నేడు కాలేజీ ప్రారంభించడంతో సుమారు 200 మంది పేద విద్యార్థులకు అవకాశం కలిగిందని తెలిపారు.ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నేడు పంట పొలాలకు సాగునీరు అందించి, రైతు అధికంగా పంటలు పండించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. రుద్రమ్మ చెరువులోకి ఎస్సారెస్పీ నీళు వచ్చే విధంగా, ప్రత్యేక ప్యాకేజీని మంత్రితో చర్చించనున్నట్లు తెలిపారు. తిరుమలగిరి ఇంటిగ్రేటెడ్ గురుకులం పాఠశాల నిర్మాణానికి



సుమారు రెండు వందల కోట్ల నిధులతో పనులు సాగుతున్నట్లు తెలిపారు. యోజకవర్గంలో ఏ అవకాశం వచ్చినా తాను అభివృద్ధి చేయుటకు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రజాపాలన 99 రోజులలో భాగంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ భద్రతా నియమాలపై వాన దారులకు, ప్రజలకు ప్రత్యేకంగా తెలియపరచి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, స్థానిక సర్పంచ్ సుజాత వెంకన్న, ఆర్డిఓ వేణుగోపాల్, తాసిల్దార్ దేవేంద్ర ప్రసాద్ ఎంపీడీవో భీమ్ సింగ్ నాయక్, నాగారం మండల పార్టీ అధ్యక్షులు తోడుసు లింగయ్య యాదవ్, అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ జయంతి సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు

ఇల్లందు : ఇల్లందు బార్ అసోసియేషన్ ఆవరణలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా జనరల్ సెక్రటరీ షేక్ మహమ్మద్ ఖాసిం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి పాల్గొని మాట్లాడుతూ అంబేద్కర్ ప్రముఖ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్తగా అంటరానితనం, కుల నిర్మూలన కోసం కృషి చేసి స్వతంత్ర భారతదేశపు తొలి న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పిగా నిలిచారని తెలిపారు. చదువుతోనే వ్యక్తి ఆలోచన, స్థాయి మారుతుందని ఆయన చూపిన మార్గంలో నడవాలని, అందరూ సమానమనే భావన రాజ్యాంగంలో ప్రతిష్టించడంలో ఆయన కృషి అపారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సపావట్ బన్సిలాల్, సీనియర్ అడ్వకేట్ చెన్నకేశవరావు, బాలకృష్ణ, స్వర్ణపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

## సంపూర్ణత అభియాన్ 2.0 లక్ష్యాలను సాధించాలి

ఆసిఫాబాద్, : నీతి ఆయో గ్ కార్యక్రమాల్లో భాగంగా సంపూర్ణత అభియాన్ లక్ష్యానికి అనుగుణంగా లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారి రజత్ సైని సూచించారు. సమీకృ త కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలోని నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా సంపూర్ణత అభియాన్ 2.0లో అమలువుతున్న పనుల లక్ష్యాల సాధనపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి కలెక్టర్ కె హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కేంద్ర ప్రభారి రజత్ సైని పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలల లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలన్నా రు. తిర్యాణి బ్లాక్, జిల్లా బ్లాక్‌ల కోసం ప్రణాళిక రూ పొందించాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించే మార్పులు తీసుకు రా వాలన్నారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన చికిత్సలు అందించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్యం, పారిశు ధ్యం, పోషణ దినోత్సవ కార్యక్రమా లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేం ద్రాల్లో తాగునీరు, టాయిలెట్ నిర్మాణాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పశువులకు టీకాలు అందించే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో బాలికలకు ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణా లు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. నీతి ఆయోగ్ కార్యక్ర మంలో భాగంగా తిర్యాణి బ్లాక్, జిల్లా బ్లాక్‌లలో మౌలిక వసతుల కల్పనలో అధికారులు సమష్టిగా పనిచేసి బ్లాక్, జిల్లా లక్ష్యాల సాధనకు కృషి చేయాల ని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా కలెక్టర్ హరిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుబోధ్‌కుమార్, జీజేహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి అంబులెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, జిల్లా సమన్వయకర్త బాలరాజు పాల్గొన్నారు.

## పేదవారి ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇల్లు

జడ్చర్ల, సొంత ఇల్లు పేదవారి ఆత్మగౌరవానికి నిదర్శనమని, అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయడమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణంలోని 17వ వార్డులో నూతనంగా నిర్మించిన 17 ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆనందాన్ని పంచుకున్నారు. తమకు సొంతిల్లు వస్తుందని తాము కలలో కూడా అనుకోలేదని,అయితే కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సమాజంలో తమ గౌరవాన్ని పెంచిందని ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులు ఎమ్మెల్యే గారితో తమ భావోద్వేగాన్ని పంచుకున్నారు. ఇందిరమ్మ మొదటి విడతలో జడ్చర్ల పట్టణానికి 550 ఇళ్లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కేటాయించడానికి, సకాలంలో బిల్లులు మంజూరు చేయించడానికి తాను చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. మలి విడతలో కూడా మరిన్ని ఇళ్లు రానున్నాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 17 వ వార్డులో ఒకేసారి 17 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడం సంతోషదాయకమని,మలి విడతలో ఈ వార్డుకు ఎన్ని అవసరమైతే అన్ని ఇళ్లు మంజూరయ్యేలా చూస్తామని అనిరుధ్ రెడ్డి ప్రకటించారు.

## విజేతలకు బహుమతులు అందజేత


కోహెడ: ఎన్టీఆర్ కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి పురస్కరించుకొని ఇటీవల పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రపటాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ హాజరైయి విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థుల సృజనత్మతాను పెంపొందిస్తూ.. అవార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులను ప్రొచ్చహించిన డాక్టర్. వేల్పుల శంకర్ ను అభినందించారు. అంటరానితనం, వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసిన ఆర్థిక వేత్త, న్యాయ కోవిదుడు, రాజ నీతిజ్ఞుడు భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ అని కొనియాడారు. మహనీయుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దర్శనాల నారాయణ, ఉపాధ్యాయులు ఎస్ గీత, కె శోభ, వి తిరుమల, రాచూరి మల్లేష్, గ్రామస్తులు నరాల సత్తయ్య, పొన్నాల రవి, తలారి బాబు, పొన్నాల మోహన్, పొన్నాల విజయ్ కుమార్, బి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# గబ్బర్ గర్వం... ఉస్తాద్ వల్ల మాయం



ఒక పవన్ కళ్యాణ్ సినిమా ఇంత వేగంగా ఫేడవుట్ అవ్వడం ఉస్తాద్ భగత్ సింగ్ విషయంలోనే జరిగిందని చెప్పాలి. గతంలో అజ్ఞాతవాసి లాంటి డిజాస్టర్లు పవన్ చూసినప్పటికీ కనీసం దాని పేరు మీద కొన్ని ఓపెనింగ్ రికార్డులు ఉన్నాయి. ఇప్పటికీ కొన్ని సెంటర్లలో వాటి గురించి చెప్పుకుంటారు. కానీ ఉస్తాద్ అందులో సగం కూడా చూపించలేకపోయింది. వంద కోట్ల గ్రాస్ అందుకోలేక త్వరగా సెలవు తీసుకున్న ఉస్తాద్ భగత్ సింగ్ ఫైనల్ రన్ వారం క్రితమే ముగిసింది. గబ్బర్ సింగ్ లాంటి ఇండస్ట్రీ హిట్ ఇచ్చిన కాంబోగా దర్శకుడు హరీష్ శంకర్ -- హీరో పవన్ కళ్యాణ్ మీద అప్పటిదాకా ఉన్న స్పెషల్ ఇంప్రెషన్, గర్వం మొత్తం ఉస్తాద్ భగత్ సింగ్ తో పోయింది. ముందు నుంచి ఈ ప్రాజెక్టు మీద అనుమానాలు వ్యక్తం చేస్తూ వచ్చిన కొందరు అభిమానుల భయాలకు తగ్గట్టే ఫలితం రావడం ట్రాజెడీ. మెయిన్ సెంటర్స్ లో ఇంకా థియేటర్ రన్ కొనసాగుతోంది కానీ నామ మాత్రపు వసూళ్లతో ఏదో మొక్కుబడిగా లాగిస్తున్నారు అంతే. దురంధర్ ది రివెంజ్ ప్రభావం వల్లే ఇలా జరిగిందని ఎవరైనా సమర్థించుకునే ప్రయత్నం చేస్తే అంతకన్నా అమాయకత్వం మరొకటి ఉండదు. ఉగాది అడ్వాంటేజ్ వల్ల ఉస్తాద్ కు ఆ మాత్రం కలెక్షన్లు వచ్చాయి కానీ ఇంకో టైంలో వచ్చి ఉంటే నెగటివిటీ, ట్రోలింగ్ ఇంకా ఎక్కువ ఉండేదేమో. హరీష్ శంకర్ విపరీతమైన ప్రమోషన్లు చేసినప్పటికీ అవేవి పని చేయలేదు. ఒక దశ దాటాక ఇక ఆపేయండి సార్ అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో చెప్పాల్సి వచ్చింది. ఒక్కటి మాత్రం పవన్ కళ్యాణ్ కు స్పష్టంగా అర్థమయ్యి ఉంటుంది. కేవలం తాను ఉన్నంత మాత్రాన సినిమా చూసేందుకు జనాలు ఎగబడిపోరు. ఏపీ డిప్యూటీ సిఎంగా పాలనలో తన ముద్ర ఎంత గొప్పగా చూపించినా సినిమాల విషయంలో ప్రేక్షకుల తీర్పు ఎప్పుడు వివక్షలకు అతీతంగా ఉంటుంది. అందుకే ఉస్తాద్ భగత్ సింగ్ కు పరాజయం తప్పలేదు సురేందర్ రెడ్డి దర్శకత్వంలో చేయబోయే సినిమా షూటింగ్ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందనేది ఇంకా ఫైనల్ కావాల్సి ఉంది.

# రజినీకాంత్ భయపడ్డాడా? జాగ్రత్తపడ్డాడా?



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం సెగలు పుట్టిస్తోంది. ముఖ్యంగా దళపతి విజయ్ తన సొంత పార్టీతో నేరుగా ఎన్నికల బరిలోకి దిగడంతో అందరి దృష్టి కోలీవుడ్ స్టార్లపై పడింది. ఇలాంటి ఉత్కంఠభరిత సమయంలో సూపర్ స్టార్ రజినీకాంత్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఏప్రిల్ 23న జరగబోయే పోలింగ్ గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన కేవలం 'నో కామెంట్స్' అని సమాధానం ఇచ్చి దాటవేశారు. గతంలో రాజకీయ ప్రకటనలతో హడావిడి చేసిన రజినీ, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారనే చర్చ మొదలైంది. రజినీకాంత్ రాజకీయాలకు దూరంగా ఉండటం వెనుక భయం ఉందా లేక ముందు జాగ్రత్త ఉందా అనే కోణంలో ఆలోచిస్తే.. ఆయన పూర్తిస్థాయిలో తన సినీ కెరీర్ పైనే ఫోకస్ పెట్టినట్లు అర్థమవుతోంది. రాజకీయాల్లోకి వస్తానని చెప్పి వెనక్కి తగ్గిన తర్వాత, మళ్ళీ ఆ విషయాల జోలికి వెళ్లడం అనవసరమని భావిస్తున్నారు. ముఖ్యంగా విజయ్ లాంటి యంగ్ స్టార్ రాజకీయాల్లోకి వెళ్లినప్పుడు, తాను ఏదైనా మాట్లాడితే అది కొత్త వివాదాలకు దారితీసే అవకాశం ఉంటుంది. అలాగే సినిమాలపై ఎఫెక్ట్ పడే ఛాన్స్ తప్పకుండా ఉంటుంది. అందుకే వివాదాలకు దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుపోవడమే ఉత్తమమని రజినీ ఫిక్స్ అయ్యారు. అసలు విషయానికి వస్తే, రజినీకాంత్ ప్రస్తుతం వరుసగా క్రేజీ ప్రాజెక్టులను లైన్ లో పెడుతున్నారు. నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్ 2' షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని ఆయన స్వయంగా వెల్లడించారు. అలాగే మరోవైపు లోక నాయకుడు కమల్ హాసన్ తో కలిసి ఆయన ఒక కొత్త ప్రాజెక్ట్ చేయబోతున్నారు. దీనికి కూడా నెల్సన్ దర్శకత్వం వహించబోతుండటం విశేషం. ఈ మెగా కాంబినేషన్ ప్రాజెక్టు ఆగస్టు 2026 నుంచి పట్టాలెక్కనుంది. రాజకీయాల గురించి రజినీ మౌనం వహించడం వల్ల ఆయన జాగ్రత్తగానే ఉన్నారని చెప్పొచ్చు. ఎందుకంటే తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు ఒక కొత్త ట్రాక్ లో ఉన్నాయి. ఒకవైపు పాత పార్టీలు, మరోవైపు విజయ్ లాంటి కొత్త పార్టీల మధ్య జరిగే ఈ పోరులో తలదూర్చడం వల్ల అనవసరమైన విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పైగా షూటింగ్ లో ఉన్న సినిమాలపై ఈ ప్రభావం పడకుండా ఉండాలని రజినీ భావిస్తున్నారు. అందుకే తన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్ కు ప్రాధాన్యత ఇస్తూ, ఎన్నికల యుద్ధం నుంచి తనను తాను పక్కకు జరుపుకున్నారు.

# మత్తు విముక్త తెలంగాణే లక్ష్యం

హైద్రాబాద్: రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే నార్కోటిక్ విభాగంతో పాటు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తుపై ఉత్తుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్విహిస్తూ.. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్ ముఠాలను కట్టడి చేస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్ల దాడులు నిర్వహించి పలువుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఒక సామాజిక విపత్తుగా మారుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు.. అన్ని జిల్లాల్లోనూ ఏకకాలంలో వీటిని అందుబాటులోకి తీసుకు వచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఈ కేంద్రాల్లో మల్టీ-డ్రగ్ టెస్ట్ కిట్‌లను సరఫరా చేశారు. ఈ కిట్‌ల ద్వారా గంజా యి, ఓపియా యిడ్స్, కొకైన్, యాంఫె టమైన్స్ వంటి దాదాపు 12 రకాల మాదకద్రవ్యా లను మూత్ర పరీక్ష ద్వారా కేవలం నిమిషాల్లోనే గుర్తించవచ్చు. గాంధీ ఆసుపత్రి సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ కె. అనుపమ తెలిపిన వివరాల ప్రకారం.. కిట్‌లో ఎరుపు గీత కనిపించకపోతే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక పరీక్షలు మాత్రమే. అవసరమైతే మరిన్ని లోతైన క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు. గత రెండు రోజుల్లో 90 మందికి పరీక్షలు చేయగా.. సుమారు 40 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన వ్యసనానికి గురైన వారు లేదా మత్తు పదార్థాలు అందక శారీరకంగా ఇబ్బంది పడే వారి కోసం సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఐసీయూ తరహాలోనే పనిచేస్తుంది. డ్రగ్స్ మానేయడం వల్ల వచ్చే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితుల్లో రోగులను ఇక్కడ చేర్చుకుని నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. పోలీసులు తీసుకొచ్చే నిందితుల విషయంలో ప్రభుత్వం పక్కాగా నిబంధనలు అమలు చేస్తోంది. నిందితులను పరీక్షల కోసం ఫారమ్ -చాతో తీసుకొస్తారు. ఫలితాలను ఫారమ్ దీలో నమోదు చేస్తారు. నిందితుడు చికిత్సకు అంగీకరిస్తే ఫారమ్ జ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపడతారు. చికిత్స తర్వాత రోగులను డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్స్‌కు పంపిస్తారు. ఇక్కడ ఆరు వారాల పాటు నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీ, నార్కోటిక్స్ అనానిమస్ వంటి గ్రూప్ సెషన్లు నిర్వహిస్తారు. వ్యసనం అనేది ఒక వ్యాధి అని దానిని చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది యువత తిరిగి సాధారణ జీవితం గడిపే అవకాశం కలుగుతుందని అంటున్నారు.

## విజయారెడ్డి ఆత్మహత్య కేసు

# నా భార్యాపిల్లల చావుకు అత్త, బావమరిదే కారణం



హైద్రాబాద్: హైదరాబాద్ శివారు చర్లపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో సహా సూసైడ్ చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. బోడుప్పల్‌లోని హరితవనం కాలనీలో నివసించే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పిన్నింటి విజయారెడ్డి అలియాస్ విజయశాంతి రెడ్డి (38), తన కుమార్తె చైతన్య రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17)తో కలిసి జనవరి 31న చర్లపల్లి - ఘట్‌కేసర్ మధ్య గూడ్స్ రైలు కిందపడి సూసైడ్ చేసుకుంది. ఆర్థికంగా, కుటుంబపరంగా ఏ ఇబ్బందులు లేనప్పటికీ ఆమె ఎందుకు ఇటువంటి కఠిన నిర్ణయం తీసుకుందనేది చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో విజయశాంతి రెడ్డి భర్త సురేందర్ రెడ్డి చేసిన ఆరోపణలతో ఈ కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. తన అత్త పుష్పలత, బామ్మర్ది చిరంజీవి, అతని భార్య ఆస్తి కోసం తన కుటుంబాన్ని తీవ్రంగా వేధించారని వారి ఒత్తిడి తట్టుకోలేకే తన భార్య పిల్లలతో సహా తనువు చాలించిందని సురేందర్ రెడ్డి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సొంత వాళ్లే నమ్మించి మోసం చేశారని.. తన భార్య పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని అన్నారు. వారిని మానసికంగా కుంగదీసి చావుకు ప్రేరేపించారని ఆరోపించారు. వాళ్లు చనిపోయిన 25 రోజులకే అత్త, బామ్మర్ది కలిసి తనను ఆస్తి కోసం బెదిరించారని సురేందర్ రెడ్డి పోలీసులకు వివరించారు. తనకు కూడా ప్రాణహాని ఉందని, తన అత్త కుటుంబం నుంచి రక్షణ కల్పించాలని ఆయన మేడిపల్లి పోలీసులను వేడుకున్నారు. తాను చనిపోతే ఆస్తి మొత్తం వాళ్లకు దక్కుతుందనే ఉద్దేశంతో తనను కూడా టార్గెట్ చేస్తున్నారన్నారు. ఒకవేళ తనకు ఏదైనా జరిగితే ఆస్తి మొత్తం తన తల్లిదండ్రులకు లేదా ఏదైనా ట్రస్టుకు చెందేలా రాస్తాను తప్ప.. తన కుటుంబాన్ని నాశనం చేసిన వాళ్లకు ఒక్క పైసా కూడా ఇవ్వనని మీడియాతో వెల్లడించారు. భార్య చనిపోయిన వెంటనే ఇంట్లోని కేజీన్నర బంగారాన్ని, రూ. 1.40 కోట్ల నగదును అత్త పుష్పలతో గుట్టు చప్పుడు కాకుండా తీసుకెళ్లిందని ఆరోపించారు. కాగా, విజయ హైటెక్ సిటీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తుండగా.. సురేందర్ రెడ్డి దుబాయ్‌లో ఉద్యోగం చేసేవారు. ఈ క్రమంలో జనవరి 30 రాత్రి హాస్టల్ నుంచి పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన విజయశాంతి రెడ్డి అర్ధరాత్రి దాటాక కారులో చర్లపల్లి స్టేషన్‌కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డయ్యాయి. ఆ తర్వాత వాళ్లు గూడ్స్ ట్రైన్ కిందపడి చనిపోయారు. సురేందర్ రెడ్డి తాజా ఫిర్యాదుతో ఈ కేసు మరోసారి తెరపైకి రాగా.. పోలీసులు ఆస్తి వివాద కోణంలో విచారణను ముమ్మరం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యం




చుంచుపల్లి, : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా చుంచుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ-అడిక్షన్, కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమన్నారు. ఈ గ్రామ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆస్పత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామ సభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు. కొన్ని జిల్లాలో అమలు చేస్తున్న "నో హెల్మెట్ -- నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, తాసీల్దార్ నాగరాజు, పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల

నల్లగొండ : దోస్త్ ద్వారా రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఏప్రిల్ 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్ దోస్తు కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా లోమహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో38 ప్రభుత్వ ప్రైవేటుడిగ్రీ కళాశాలలు ఉన్నాయి. 20,వేల నుండి 25,వేల అడ్మి షన్ లు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరుటకు అవకాశం ఉంది. జిల్లాలో ప్రధానంగా నాక్ ఏ గ్రేడ్ పొందిన ఏకైక కళాశాల నల్గొండ జిల్లా కేంద్రంలో ని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. అర్హులైన విద్యార్థులు రూ. 200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో విద్యార్థిని విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి

## కాలుష్య జలాలు వదిలితే భరతం పడతాం

జిన్నారం: ప్రజలకు ఉపాధి లభిస్తుందని పరిశ్రమల స్థాపనకు స్వాగతం పలికితే అవే పరిశ్రమలు ప్రజల ప్రాణాలు తీస్తూ ప్రతి రోజు కాలకూట విషాన్ని వెదజల్లుతున్నాయని, తీరు మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని చెట్ల పోతారం పరిధిలోగల అయ్యమ్మ చెరువు పరిస్థితిపై సోమవారం మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి చెరువు కట్టపైనే ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో కాలుష్య జలాలు కలవడం మూలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే జీఎంఆర్ కు తెలిపారు. ప్రతిరోజు ప్రత్యక్ష నరకం అనుభవించడంతో పాటు క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకి ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా తమ బతుకులు చిద్రమవుతున్నాయని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ గడ్డపోతారం పరిధిలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉపాధి లభించడంతో పాటు ప్రజలు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారని పరిశ్రమల ఏర్పాటుకు అంగీకారం తెలిపితే నేడు అవే పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తూ స్థానిక చెరువులను తమ రసాయన జలాలతో కాలుష్యం చేస్తూ ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని అవసరమైతే కాలుష్య పరిశ్రమలను తరిమికొడతామని హెచ్చరించారు. కాలుష్యాన్ని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై ప్రజలు నేరుగా ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మీ నిర్లక్ష్యం చేతగానితనం మూలంగానే పరిశ్రమలు విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని అన్నారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత

సదాశివపేట: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ... ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని వాహనదారులను ఉద్దేశించి ఎస్పి పదితోజు పంకజ్ అన్నారు. సదాశివపేట మండలం ఆరూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలలో భాగంగా గ్రామసభ నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అరైవ్ -- అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆరూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ నాయకుడి లావణ్య మధు అధ్యక్షతన సోమవారం నాడు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మధు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి మన ప్రాణాలకు రక్షణగా ఉన్న హెల్మెట్ కానీ సీట్ బెల్ట్ కానీ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. జిల్లా ఎస్పీ పనితోష్ పంకజ్ మాట్లాడుతూ మన జాగ్రత్తలే మనకు రక్షణగా ఉంటుందని డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితమైన జీవితాన్ని గడపాలని ప్రజలచేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి సత్తయ్య గౌడ్,ఎస్ హెచ్ ఓ వెంకటేశం, మండల తాసిల్దార్ హరిచంద్ర ప్రసాద్,డాక్టర్ పరుశురాం, ఆరూర్ గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ మరియు వార్డు మెంబర్లు వాహనదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తల్లిని సజీవ దహనం చేసిన తనయుడు

ఒంగోలు; ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్నతల్లి అని కూడా చూడకుండా ఓ కుమారుడు ఆమెను సజీవదహనం చేశాడు. గదిలో బంధించి, ఇంటికి నిప్పుపెట్టడంతో ఆ వృద్ధురాలు మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయింది. ఈ పాశవిక ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఒంగోలులోని గద్దలగుంట ప్రాంతంలో ఈరోజు ఉదయం ఈ ఘటన జరిగింది. కొంతకాలంగా తల్లితో గొడవ పడుతున్న కుమారుడు, ఈ రోజు మాటామాటా పెరగడంతో ఆవేశానికి లోనయ్యాడు. తల్లిని ఒక గదిలో పెట్టి బయట నుంచి తాళం వేసి, అనంతరం పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు తెలుస్తోంది. ఇంటి నుంచి దట్టమైన పొగ, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే లోపల ఉన్న వృద్ధురాలు పూర్తిగా కాలిపోయి మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడైన కుమారుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# హైడ్రా కూల్చివేతలకు హైకోర్టు బ్రేక్






హైద్రాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. హైడ్రా విధులకు సంబంధించిన స్పష్టమైన విధివిధానాలు, మార్గదర్శకాలను న్యాయస్థానానికి సమర్పించే వరకు అక్రమ నిర్మాణాల కూల్చివేతలు నిలిపివేయాలని తాజాగా హైకోర్టు ఆదేశించింది. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎం.ఎ.షరీఫ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై సోమవారం (ఏప్రిల్ 13న) విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెల్లవారుజామున 4.30 గంటలకే వందలాది మంది సిబ్బందితో వచ్చి ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా 100 ఏళ్ల నాటి ఇంట్లోని నీటి ట్యాంకు, కాంపౌండ్ వాల్ కూల్చివేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొందని వివరించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను కోర్టుకు సమర్పించగా.. న్యాయమూర్తి వాటిని చూశారు. వీడియోలో నీలం రంగు యూనిఫాంలో వందలాది మంది సిబ్బంది గుమిగూడి ఉండటంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నోటీసు ఇవ్వకుండా ఒక భారీ కట్టడాన్ని కూల్చివేయడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఒక నిర్మాణం అనధికారికమని అధికారులు భావిస్తే.. అది కడుతున్నప్పుడే ఎందుకు అడ్డుకోలేదని హైకోర్టు ప్రశ్నించింది. అనుమతులు లేకుండా కడుతుంటే ఇన్నాళ్లూ మౌనంగా ఉండి ఇప్పుడు అకస్మాత్తుగా కూల్చివేస్తామంటే ఎలా అని నిలదీసింది. ప్రభుత్వం జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 374బీ కింద హైడ్రాకు అధికారాలు ఇచ్చినప్పటికీ చట్టపరమైన ప్రక్రియను పాటించాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. దాదాపు వందకు పైగా కేసుల్లో హైడ్రా ప్రతివాదిగా ఉందని.. ఎక్కడా ప్రామాణిక విధానం అనుసరించినట్లు కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది. కాగా, చెరువులు, నాలాలు, నీటి వనరులు, పార్కులు, ప్రజా రహదారుల పునరుద్ధరణ కార్యక్రమాలను హైడ్రా యథావిధిగా చేపట్టవచ్చునని హైకోర్టు తన ఉత్తర్వుల్లో కొన్ని వెసులుబాట్లను కల్పించింది. నివాస ప్రాంతాల్లోని అంతర్గత రహదారులు, ప్రహరీ గోడల తొలగింపు వంటి బలవంతపు చర్యలు మాత్రం చేపట్టకూడదని ఆదేశించింది. మున్సిపాలిటీ చట్టాల ప్రకారం నోటీసులు ఇచ్చి.. వివరణ కోరిన తర్వాతే తదుపరి చర్యలు ఉండాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ భూముల కబ్జాను అడ్డుపెట్టుకుని పిటిషనర్లు 1000 ఎకరాల భూమిని ఆక్రమించారని అదనపు అడ్వొకేట్ జనరల్ వాదించినప్పటికీ.. చట్టపరమైన నిబంధనలు పాటించకపోవడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. ఐలాపూర్ భూములకు సంబంధించి యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశిస్తూ.. హైడ్రా తన పూర్తి విధివిధానాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. ప్రభుత్వ లక్ష్యం మంచిదైనప్పటికీ అనుసరించే విధానం చట్టబద్ధంగా ఉండాలని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత




మహబూబ్‌నగర్: రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ డి జానకి అన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా నవాబుపేట మండలం రుద్రారం గ్రామంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సుకు జిల్లా ఎస్పీ డి. జానకి హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయిలో డ్రైవింగ్ లైసెన్స్ లేని అర్హులైన వ్యక్తులను గుర్తించి, వారు లైసెన్స్ పొందేందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు, మార్గదర్శకత్వాన్ని పోలీసు శాఖ అందిస్తుందని తెలిపారు. చట్టబద్ధమైన లైసెన్స్ కలిగి ఉండటం కేవలం నిబంధన మాత్రమే కాదని, అది బాధ్యతాయుతమైన డ్రైవింగ్కు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ప్రతి ప్రమాదం ఒక కుటుంబానికి తీరని లోటురోడ్డు భద్రతపై ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సదస్సులో ఆర్ అండ్బీ అధికారి సంధ్య,డిటీఓ రఘు కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్, ఆరోగ్య అధికారి శ్రావణ్, ఎస్ప్లు విక్రమ్, సర్పంచులు రవి, సంతోషి పాల్గొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యా సదృశ్యమని, వేగ పరిమితిని మించవద్దని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ముందస్తు జాగ్రత్తలతో కూడిన డ్రైవింగ్ విధానాలను అలవర్చుకోవడం ద్వారా 90% ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. ప్రమాదం జరిగినప్పు డు వెంటనే స్పందించి, గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించాలని యువతకు పిలుపునిచ్చారు. గ్రామాల్లోని ప్రమాదకర మలుపులు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే చోట్లు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. రాత్రి వేళల్లో రోడ్లపై వెళ్లే ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు అంటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. పాఠశాల విద్యార్థులకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం చివరలో అందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సదస్సులో =ఒడీ అధికారి సంధ్య,ౖడూ రఘు కుమార్, =ఒజ డిపో మేనేజర్ అశోక్, ఆరోగ్య అధికారి శ్రావణ్, ఎస్ప్లు విక్రమ్, సర్పంచులు రవి, సంతోషి మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# నాంపల్లి కోర్టు సంచలన తీర్పు

హైద్రాబాద్: మైనర్ల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు వేయించడంలో పోలీసులు మరోసారి విజయం సాధించారు. సంజీవరెడ్డి నగర్ పరిధిలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఓ మైనర్ బాలికపై లైంగిక దాడిచేసి ఆమె తల్లి కావడానికి కారకుడైన ఓ యువకుడికి నాంపల్లి 12వ అదనపు సెషన్స్ కోర్టు మరణించే వరకు జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెలువరిం చింది. దీంతో పాటు సదరు నేరగాడు. బాధిత బాలికకు పది లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని, పది వేల రూపాయల జరిమానా. కూడా కట్టాలని తీర్పు చెప్పింది. వివరాలు ఇలావున్నాయి. 2014 మే 11వ తేదీన ఎస్ఆర్ నగర్ లోని బికె గూడాకు చెందిన తొమ్మిదవ చదువుతున్న మైనర్ బాలిక కడుపునొప్పితో అమీర్పేట్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా ఆ బాలిక గర్భవతిగా వున్నట్లు వైద్యులు తెలిపారు. కొన్ని గంటల తరువాత ఆ బాలిక మగ శిశువుకు జన్మనిచ్చింది. దీనిపై వైద్యులతో పాటు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడు మడకారు శ్రీనివాసులు (24)పై ఫోక్సో కేసు నమోదు చేశారు. వాస్తవానికి ఈ కేసులో బాధిత బాలిక సెలవుల కోసం చుట్టాల ఇంటికి రాగా కర్నూలుకు చెందిన శ్రీనివాసులు ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి బికె గూడలో వుండసాగాడు. ఆ బాలికకు బంధువైన ఓ బాలుడితో ఆడుకునే నెపంతో తరచూ ఇంటికి వచ్చే శ్రీనివాసులు ఇదే సమయంలో బాలికపై లైంగికదాడికి పాల్పడి ఆమెను గర్భవతి చేశాడు. ఆ బాలిక శిశువుకు జన్మనిచ్చిన తరువాత వైద్యుల సూచనల మేరకు పోలీసులకు నిందితుడు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగు చూసింది. అనం తరం శ్రీనివాసులును అరెస్టు చేసి చంచల్గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో పోలీసులు వేగంగా విచారణ చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై ఏడాదిన్నరకు పైగా వాదనలు జరిగాయి, ఈలోపు నిందితుడు శ్రీనివాసులు బెయిల్పై విడుదలయ్యాడు. దీనిపై సోమవారం నాడు నాంపల్లి 12వ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి టి. అనిత తీర్పు వెలువరిస్తూ మైనర్ బాలికపట్ల అమానుషంగా ప్రవర్తించిన నిందితుడ శ్రీనివా సులుకు మరణించే వరకు జీవిత ఖైదు శిక్ష విధించారు. దీంతో పాటు బాధిత బాలికకు పది లక్షల రూపాయలు పరిహారంగా చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు. ఇదే కేసులో నిందితుడికి పది వేల రూపాయల జరిమానా కూడా. విధించారు. జరిమానా చెల్లించకుంటే ఆరు నెలల సాధారణ జైలు శిక్షను అనుభవించాల్సి వుంటుందని జడ్జి తెలిపారు. తీర్పు వెలువడిన వెంటనే నిందితుడు శ్రీనివాసులును పోలీసులు అరెస్టు చేసి చంచల్గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా శ్రీనాధ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్గా రామకృష్ణ, లీగల్ కౌన్సిలర్లుగా కల్పన, హేమ మీనన్ వ్యవ హరించారు. ఫోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడేలా చేసిన పోలీసు అధికారులను ఎస్ఆర్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

## పోలీస్ వాహనం ఢీకొనడంతో ఏఎస్ఐ మృతి..

సంగారెడ్డి :సంగారెడ్డి జిల్లాలో పోలీస్ వాహనం ఢీకొని విధి నిర్వహణలో ఉన్న ఓ ఏఎస్ఐ మరణించారు. మానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మానూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న గోవింద్ నాయక్ విధి నిర్వహణలో ఉన్న సమయంలో హోంగార్డు రామారావు నడుపుతున్న పోలీసు వాహనం అదుపుతప్పి ఆయనను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయనకు తీవ్రంగా గాయపడ్డారు. తోటి సిబ్బంది వెంటనే ఆయనను నారాయణఖేడ్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆయన మృతిచెందారు. అయితే ఈ ఘటనపై మృతుని కుటుంబసభ్యులు సంచలన ఆరోపణలు చేశారు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదని, పాత కక్షల నేపథ్యంలో హోంగార్డు రామారావును కావాలనే వాహనంతో ఢీకొట్టి హత్య చేశారని వారు ఆరోపిస్తున్నారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే రామారావు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హోంగార్డు నడుపుతున్న వాహనం ఢీకొని ఏఎస్ఐ మృతిచెందడం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. మానూర్ పోలీస్‌స్టేషన్ ముందే ఈ ఘటన జరిగింది.

# నానో ఎరువులపై ఇఫ్కో అవగాహన




న్యూఢిల్లీ, : ఇఫ్కో దేశవ్యాప్తంగా నానో ఎరువుల అవగాహన మెగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీ నుంచి ఐదు నానో ప్రమోషన్ వ్యాన్లను జెండా ఊపి ప్ర చారానికి చారిత్రాత్మకమైన నాంది పలికారు. ఈ సందర్భంగా దిలీప్ సంఘాని మాట్లాడుతూ ఈ ప్రచారం 560 జిల్లాలు, 19 రా ష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 3,477 తహసీల్లలో విస్తృతంగా నిర్వహించబడుతుందని అని పేర్కొన్నారు. భారతీయ రైతు ల్లో నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఇది సమగ్ర జాతీయ ప్రచా రం అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం, సహకార మంత్రి అమి త్ షాల స్ఫూర్తితో 'ఆత్మనిర్భర భారత్', 'సహకార్ సే సమృద్ధి' వంటి జాతీయ మిషన్లకు అనుగుణంగా ఈ ప్రచారం ప్రారంభించబడిందన్నా రు. వ్యవసాయంలో నానో టెక్నాలజీలో భారతదేశం పెరుగుతున్న ప్ర పంచ బలాన్ని హైలైట్ చేస్తుంది. వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి సంప్రదాయం , సాంకేతికత కలిసి వచ్చే చారిత్రక దశలో భారతదేశం ఉందని సంఘాని పేర్కొన్నారు. నానో ఫెర్టిలైజర్ విప్లవం భారత వ్యవసాయానికి ఒక పరివర్తన క్షణమని ఆయన అభివర్ణించారు. నానో ఎరువులు కేవలం ఉత్పత్తులు మాత్రమే కాదని, భూసారాన్ని పరిరక్షించడానికి, పర్యావరణాన్ని మెరుగుపరచడానికి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి సాధనాలు అని ఆయన అన్నారు. ప్రతిరం గంలో నానో ఎరువులు స్వావలంబన భారతదేశం భవిష్యత్తును సూచిస్తాయని పేర్కొంటూ, తక్కువ ఖర్చు, అధిక ఉత్పాదకత, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఆయన కోరారు. ఇఫ్కో నానో యూరియా ప్లస్ లిక్విడ్ 21.8 మిలియన్ బాటిళ్ల అమ్మకాలను, 6.426 మిలి యన్ నానో డీఏపీ లిక్విడ్ బాటిళ్లను నమో దు చేసింది. నానో జింక్,నానో కాపర్ కూడా మొదటి సంవత్సరం వరుసగా 5.7 మిలియన్, 0.2 మిలియన్ బాటిళ్ల బలమైన అ మ్మకాలను సాధించాయి. నానో టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, ఏఐ, డేటా అనలిటిక్స్లో ని రంతర ఆవిష్కరణల ద్వారా, భారతదేశ వ్యవసాయ రంగాన్ని మార్చడంలో ఇఫ్కో కీలక పాత్ర పోషిస్తోంది. కార్యక్రమం ఇఫ్కో సదన్‌లో ఎండీ కేజే పటేల్, బోర్డు సభ్యులు, అధి కారులు ,ఉద్యోగుల సమక్షంలో జరిగింది.

# వృద్ధుల కోసం ప్రభుత్వ డే కేర్ సెంటర్లు..



హైద్రాబాద్:ఉద్యోగ రీత్యా పిల్లలు సుదూర ప్రాంతాలకు వెళ్లటం, విదేశాల్లో స్థిరపడటం, మరికొందరు తల్లిదండ్రులను పట్టించుకోకపోవటం వంటి కారణాలతో నేడు ఎంతోమంది వృద్ధులు ఇళ్లల్లో ఒంటరిగా జీవిస్తూ కుంగుబాటుకు లోనవుతున్నారు. అవసానదశలో బాగోగులు చూసేవారులేక ధీనంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారి ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా చివరి దశలో వారి జీవితాల్లో ఆనందాన్ని నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రణామ్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా మల్టీ సర్వీస్ డే కేర్ కేంద్రాలను ప్రారంభించింది. చిన్నారుల కోసం డే కేర్ సెంటర్లను చూడటం పరిపాటే కానీ.. వృద్ధుల కోసం ప్రభుత్వమే ఇలాంటి కేంద్రాలను నిర్వహించడం దేశంలోనే ఇదే తొలిసారి కావడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 37 కేంద్రాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో జనవరిలో ప్రారంభమైన కేంద్రం వృద్ధులకు ఒక వరంగా మారింది. ఇక్కడ ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వృద్ధులు సమయాన్ని కేటాయిస్తున్నారు. వారి సంరక్షణ కోసం ఒక సూపర్‌వైజర్, కుక్, అటెండర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడికి వచ్చే వారికి టీ, స్నాక్స్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. నిత్యం 50 నుంచి 60 మంది వృద్ధులు ఈ కేంద్రానికి వస్తూ సామాజికంగా ఉల్లాసంగా గడుపుతున్నారు. ఈ డే కేర్ కేంద్రాలు కేవలం కాలక్షేపానికే పరిమితం కాకుండా, వృద్ధుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఇక్కడ టీవీ, హైస్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు ఆధ్యాత్మిక, సాహిత్య పుస్తకాలతో కూడిన లైబ్రరీ అందుబాటులో ఉంది. శారీరక, మానసిక దృఢత్వం కోసం క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేశారు. జిల్లా ఆసుపత్రుల్లోని జెరియాట్రిక్ క్లినిక్‌లతో ఈ కేంద్రాలను అనుసంధానించారు. వృద్ధులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఫిజియోథెరపీ సేవలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. సాయంత్రం వేళల్లో అందరూ కలిసి చేసే ధ్యానం వారికి మానసిక ప్రశాంతతను ఇస్తోందని వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన ఈ డే కేర్ సెంటర్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హనుమకొండ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగిలిన జిల్లాల్లో ఒక్కో కేంద్రం చొప్పున సేవలు అందిస్తున్నాయి. వృద్ధుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సెలవు దినాలు, ఆదివారాలు మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఈ కేంద్రాలు వృద్ధులకు స్వాగతం పలుకుతున్నాయి. మీ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎవరైనా ఒంటరి వృద్ధులు ఉంటే ఈ డే కేర్ సెంటర్ల గురించి తెలియజేయాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

## ఢిల్లీలో ఎలక్ట్రిక్ వాహనాలకు భారీ రాయితీలు

న్యూఢిల్లీ:దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కొత్తగా రూపొందించిన 'ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 2026-2030' ముసాయిదాను రవాణా శాఖ విడుదల చేసింది. ఈ పాలసీ ప్రకారం రూ.30 లక్షల లోపు ఎలక్ట్రిక్ కార్లకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి 100 శాతం మినహాయింపు లభించనుంది. ఈ ప్రయోజనం 31 మార్చి 2030 వరకు అమల్లో ఉంటుంది. తక్కువ ఉద్గారాలను విడుదల చేసే హైబ్రిడ్ వాహనాలకు కూడా 50 శాతం రాయితీని ప్రతిపాదించింది. గాలి నాణ్యతను మెరుగుపరచడం, ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం ఈ పాలసీ లక్ష్యాలు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280